సాక్షి
అనకాపల్లి
శుక్రవారం । 10 । అక్టోబర్ । 2025



పెందుర్తి జంక్షన్ వద్ద జననేతకు స్వాగతం పలుకుతున్న అశేష జనవాహిని



మీడియాతో మాట్లాడుతున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



భీమబోయినపాలెం మెడికల్ కాలేజీ వద్దకు భారీగా తరలివచ్చిన ప్రజలు

- విశాఖ ఎయిర్‌పోర్ట్ నుంచి పెందుర్తి, అనకాపల్లి మీదుగా పర్యటన
- జనజాతరతో హోరెత్తిన ఉమ్మడి విశాఖ జిల్లా
- కూటమి ప్రభుత్వం అడ్డంకులు సృష్టించినా వెరవని ప్రజలు
- రోప్‌పార్టీలు, చెక్‌పోస్టులు దాటుకొని జగన్‌తో కరచాలనం చేసేందుకు పోటీ
- భారీ వర్షంలోనూ హుషారుగా సాగిన జగన్ పర్యటన
- ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మాణ పనుల పరిశీలన
- అనంతరం కేజీహెచ్‌లో కురుపాం గిరిజన బాలికలకు పరామర్శ

అడుగడుగునా అదే ఆప్యాయత

మండుటెండలోనూ అడుగు వెనక్కిపడలేదు. ఆకాశం చిల్లుపడేలా వర్షం పడినా వెరవలేదు. అదే అభిమానం.. చెక్కు చెదరని ఆదరణ. విశాఖ పర్యటనకు వచ్చిన జననేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అడుగడుగునా హారతులు పట్టారు. ప్రతి జంక్షన్‌లోను పూల వర్షం కురిపించారు. గజమాలలతో స్వాగతాలు పలికారు. విశాఖ ఎయిర్‌పోర్ట్ నుంచి మాకవరపాలెం మెడికల్ కాలేజీ వరకు సాగిన ఈ పర్యటనలో బ్రహ్మరథం పట్టారు. ఈ పర్యటనకు జనాలు రాకుండా చేసేందుకు కూటమి ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా వాటన్నింటినీ పటాపంచలు చేశారు. బారికేడ్లు, రోప్ పార్టీలు, చెక్‌పోస్టులు జనహోరు ముందు నిలవలేకపోయాయి. జంక్షన్లు జనజాతరను తలపించాయి. మార్గంమధ్యలో బాధలు, సమస్యలతో వచ్చిన వారి నుంచి వినతులు స్వీకరిస్తూ.. వారికి భరోసా ఇస్తూ.. సుమారు 60 కిలోమీటర్ల మేర అభిమానంతో వచ్చిన ప్రతి ఒక్కరికీ అభివాదాలు చేస్తూ.. జనసునామీలో ముందుకు సాగారు. అభిమాన నేతకు కరచాలనం చేసేందుకు మహిళలు, వృద్ధులు, యువత పోటీ పడ్డారు. సాధారణంగా 60 కిలోమీటర్ల ప్రయాణానికి గంటన్నర సమయం పడుతుంది. కానీ విశాఖను చుట్టేసిన జన సంద్రాన్ని తన చిరునవ్వుతో పలకరిస్తూ సాగిన ఆయన పర్యటనకు 6 గంటలు పట్టిందంటే ప్రజానీకం ఎలా వెల్లువలా వచ్చిందో అర్థం చేసుకోవచ్చు. – విశాఖ సిటీ

అడ్డంకులు సృష్టించినా జన సునామీ



చోడవరం-అనకాపల్లి రోడ్డులో దుడ్డుపాలెం జంక్షన్ వద్ద వాహనాలు చెక్ చేస్తున్న పోలీసులు



గోపాలపట్నం వద్ద కార్యకర్తలు, నేతలను అడ్డుకుంటున్న పోలీసులు

నర్సీపట్నం నియోజకవర్గం మాకవరపాలెంలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలను పీపీపీ విధానంలో ప్రైవేటుపరం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోంది. ఇందులో భాగంగానే అసలు మెడికల్ కాలేజీల నిర్మాణాలే జరగలేదని, మాకవరపాలెంలో నిర్మాణంలో ఉన్న కాలేజీకి జీవో ఉంటే చూపించాలని మంత్రులు సవాల్ విసిరారు. ఈ నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నర్సీపట్నం మెడికల్ కాలేజీ నిర్మాణాలను పరిశీలించడానికి గురువారం విశాఖకు వచ్చారు. జగన్ పర్యటనకు భారీగా జనసందోహం తరలివస్తుండడంతో కూటమి ప్రభుత్వానికి కంటగింపుగా మారింది. దీంతో ముందు ఆయన రోడ్‌షోకు అనుమతి లేదని పోలీసులతో చెప్పించింది. ఎన్ని అడ్డంకులు సృష్టించిన రోడ్‌షో ఆగేది లేదని వైఎస్సార్‌సీపీ నేతలు తెగేసి చెప్పడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. జగన్ రోడ్‌షో చేస్తే జనసునామీ తప్పదని భావించిన చంద్రబాబు ప్రభుత్వం రాత్రికి రాత్రి షరతులతో కూడిన అనుమతులు మంజూరు చేసింది. పోలీసుల సాయంతో ఆటోలు, ప్రైవేటు వాహన యజమానులతో సమావేశాలు పెట్టించి.. జగన్ కార్యక్రమానికి జనాలను తీసుకువెళ్లొద్దని హెచ్చరికలు జారీ చేయించింది. అలాగే వైఎస్సార్‌సీపీ నేతలకు ఫోన్లు చేయించి జన సమీకరణ చేయకూడదని బెదిరించే ప్రయత్నం చేసింది. గురువారం తెల్లవారుజాము నుంచే రోడ్లపై బారికేడ్లు, రోప్ పార్టీలు దర్శనమిచ్చాయి. గ్రామాల్లో చెక్‌పోస్టులు వెలిశాయి.

- ప్రధానంగా విశాఖ ఎయిర్‌పోర్టు వద్ద మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలికేందుకు వేల మంది జనాలు వస్తారని భావించిన పోలీసులు ఎన్ఎస్‌టీఎల్ గేటు ఎదురుగా బలగాలను మోహరించారు. ఆటోలు, ప్రైవేటు వాహనాల్లో గ్రూపులుగా విమానాశ్రయం రహదారిలోకి వెళ్లకుండా నిరోధించే ప్రయత్నం చేశారు. ఎయిర్‌పోర్టు రహదారి ప్రారంభంలో కూడా పోలీసులు వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులను అడ్డుకున్నారు.
- ఎయిర్‌పోర్టు నుంచి మాజీ సీఎం జగన్ కాన్వాయ్ బయలుదేరిన తర్వాత ఎన్ఏడీ కొత్త రోడ్డు వద్ద వెనుక ఉన్న వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకుల వాహనాలను అడ్డగించారు. కేవలం పోలీస్ ఎస్కార్ట్‌తోనే జగన్ కాన్వాయ్‌ను అనుమతించారు.
- గోపాలపట్నం, సింహాచలం ముఖద్వారం, వేపకుండా కూడలి, పెందుర్తి– అనకాపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి ప్రాంతాల్లోను పోలీసులు ఇదే తరహా ధోరణిని అవలంబించారు.
- పోలీసులు కాన్వాయ్‌లోని వాహనాలను అడ్డుకున్న ప్రతిసారి.. నిమిషాల వ్యధిలో రెట్టించిన ఉత్సాహంతో పార్టీ శ్రేణుల వాహనాలు ఎక్కడకక్కడ కాన్వాయ్‌లో వచ్చి చేరాయి.
- పెందుర్తి హైవేపైనా అడ్డుకోగా పినగాడి, సబ్బవరం, అనకాపల్లి ఇలా.. పార్టీ శ్రేణుల వాహనాలు కాన్వాయ్‌లో కలుస్తూ పర్యటనకు మరింత ఊపు తెచ్చారు.
- అనకాపల్లి మండలం మార్టూరు జంక్షన్ వద్ద వాహనదారులను సైతం ఎక్కడకు వెళుతున్నారో తెలుసుకున్న తర్వాతే పంపించారు. కొత్తూరు జంక్షన్ వద్ద జగన్‌ను చూసేందుకు వెళుతున్న జనాలను పోలీసులు అడ్డగించారు.



మెడికల్ కాలేజీ దగ్గర ప్రజలను నిలువరించేందుకు ఇనుప కంచె వేసిన పోలీసులు

- కశింకోట మండలం నర్సింగపల్లి వద్ద ఆటోల్లో ప్రయాణికులను వెళ్లనీయలేదు. అత్యవసర పనులపై వెళుతున్నట్లు ఆధారాలు చూపిస్తే గానీ ఆటోల్లో ప్రయాణికులను ముందుకు కదలనీయలేదు.
- యలమంచిలి ఫ్లై ఓవర్ వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. షేకిళ్లపాలెం హైవేలో సైతం ద్విచక్ర వాహనదారులను వెళ్లకుండా అడ్డుకున్నారు.
- నర్సీపట్నం నియోజకవర్గంలో ఇతర గ్రామాల నుంచి వచ్చే ఆర్టీసీ బస్సుల్లో పోలీసులు ఎక్కి మరీ ప్రయాణికులు ఎక్కడకు వెళుతున్నారని ఆరా తీసి పంపించారు.

చేతులెత్తి మొక్కుతూ.. మనసారా అభివాదం చేస్తూ.. ముందుకు సాగిన మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

కష్టాలు వింటూ.. వినతులు స్వీకరిస్తూ..



బల్క్ డ్రగ్ వద్దు అనే ప్లకార్డును ప్రదర్శిస్తూ..

- మాజీ సీఎం జగన్ పర్యటనలో ప్రజలు, గ్రామస్తులు తమ కష్టాలు, సమస్యలను విన్నవించుకునేందుకు పోటీ పడ్డారు. ప్రతి ఒక్కరి బాధలను వింటూ భరోసా ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తుందని సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.
- ఎయిర్‌పోర్టు దాటిన తరువాత కాకానినగర్ వద్ద వైఎస్సార్ సీపీ గాజువాక సమన్వయకర్త దేవన్‌రెడ్డి ఆధ్వర్యంలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ సభ్యులు మంత్రి రాజశేఖర్, అయోధ్యరామయ్యతో పాటు పలువురు జగన్‌ను కలిశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ, కార్మికుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడమే వైఎస్సార్‌సీపీ లక్ష్యమని, కార్మికులకు అండగా ఉంటామని జగన్ హామీ ఇచ్చి ముందుకు కదిలారు.



ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ సభ్యుల నుంచి వినతిపత్రం స్వీకరిస్తున్న మాజీ సీఎం జగన్

- బి.భీమవరంలో బల్క్ డ్రగ్ పార్క్ బాధిత నిర్వాసితులు కలిశారు. ఆ పార్క్ వల్ల జరిగే నష్టాలను వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. వారి కష్టాలను తెలుసుకున్న జగన్.. బాధితులు తీసుకొచ్చిన ప్లకార్డును పట్టుకుని వారికి మద్దతు తెలిపారు.
- గోవాడ షుగర్ ఫ్యాక్టరీని కాపాడాలని రైతులు, కార్మికులు జగన్‌ను కోరారు.
- తాళ్లపాలెం జంక్షన్ వద్ద ఎన్ఏవోబీ నిర్వాసితులు వినతిపత్రం అందజేశారు.
- ఇలా అనేక ప్రాంతాల్లో స్థానిక సమస్యలు, ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై జగన్‌కు వినతిపత్రాలు అందజేశారు.



అభిమాన నేతకు హారతిస్తూ..



అదిగదిగో జగనన్న

పాల్గొన్నది వీరే..

శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు, ఎంపీలు పిల్లి సుభాష్‌చంద్ర బోస్, తనూజరాణి, పార్టీ విశాఖ, అనకాపల్లి, విజయనగరం జిల్లా అధ్యక్షులు కేకే రాజు, అమర్‌నాథ్, మజ్జి శ్రీనివాసరావు, మాజీ డిప్యూటీ సీఎంలు బూడి ముత్యాలనాయుడు, పీడిక రాజన్నదొర, పుష్పశ్రీవాణి, ధర్మాన కృష్ణదాస్, మాజీ మంత్రులు విడదల రజినీ, పేర్ని నాని, దాడిశెట్టి రాజా, సిదిరి అప్పలరాజు, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యేలు మత్స్యరాస విశ్వేశ్వరరాజు, రేగం మత్స్యలింగం, జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, పార్టీ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, అనకాపల్లి పార్లమెంట్ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్, పార్లమెంట్ పరిశీలకులు సూర్యనారాయణరాజు, కదిరి బాబురావు, శోభాహైమావతి, మాజీ ఎమ్మెల్యేలు పెట్ల ఉమాశంకర్ గణేష్, వాసుపల్లి గణేష్‌కుమార్, కరణం ధర్మశ్రీ, కంబాల జోగులు, మళ్ల విజయప్రసాద్, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, కె.భాగ్యలక్ష్మీ, మాజీ ఎంపీలు భీశెట్టి వెంకట సత్యవతి, గొడ్డేటి మాధవి, సమన్వయకర్తలు మలసాల భరత్‌కుమార్, మొల్లి అప్పారావు, దేవన్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శిలు చింతకాయల సన్యాసిపాత్రుడు, చిక్కాల రామారావు, వీసం రామకృష్ణ, పైలా శ్రీనివాసరావు, దంతులూరి దిలీప్‌కుమార్, ఉత్తరాంధ్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్లె అనురాధ, సినీనటుడు జోగినాయుడు, ముఖ్యనేతలు డాక్టర్ లక్ష్మీకాంత్, ఎర్రాపాత్రుడు, మున్సిపల్ చైర్మన్ బోడపాటి సుబ్బలక్ష్మీ, వైఎస్ చైర్మన్ కొనేటి రామకృష్ణ, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి చింతకాయల వరుణ్, మాకవరపాలెం ఎంపీపీ రుత్తల సర్వేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు చిటికెల రమణ, జెడ్పీటీసీ పెట్ల సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

పర్యటన సాగిందిలా..

- ఉదయం 10.16 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి విమానంలో బయలుదేరి ఉదయం 11.03 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు.
- 11.22 గంటలకు ఎయిర్‌పోర్టు నుంచి బయటకు వచ్చారు. అక్కడకు వచ్చిన వైఎస్సార్ సీపీ నేతలను ఆత్మీయంగా పలకరించారు. కార్యకర్తలు, అభిమానాలకు కరచాలనం చేశారు.
- ఉదయం 11.25 గంటలకు విమానాశ్రయం నుంచి మాజీ సీఎం జగన్ కాన్వాయ్ బయలుదేరింది.
- మధ్యాహ్నం 12.29కు వేపగుంటకు చేరుకున్నారు. అక్కడ భారీగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు అభిమానాలు ఉండడంతో వారికి అభివాదాలు చేస్తూ ముందుకు వెళ్లారు.
- మధ్యాహ్నం ఒంటి గంటకు పెందుర్తి జంక్షన్‌కు కాన్వాయ్ చేరుకుంది. అక్కడ కూడా భారీ సంఖ్యలో మహిళలు, వృద్ధులు జగన్‌కు గజమాలతో స్వాగతం పలికారు. వారందరికీ అభివాదం చేస్తూ జాతీయ రహదారిపై అనకాపల్లి వైపు కదిలారు.
- మధ్యాహ్నం 2.20కి అనకాపల్లి చేరుకున్నారు. భారీ వర్షంలోను జననేతతో కరచాలనం చేసేందుకు ప్రజలు పోటీ పడ్డారు.
- మధ్యాహ్నం 3.19కి కశింకోట మండలం తాళ్లపాలెం జంక్షన్ వద్ద జగన్‌ను చూసేందుకు హోరు వానలోను తరలివచ్చారు.
- మధ్యాహ్నం 3.50కి భీమవరం వద్ద జగన్‌కు భారీ సంఖ్యలో ప్రజలు స్వాగతం పలికారు.
- సాయంత్రం 4.20కి కన్నూరుపాలెంకు చేరుకున్న జననేతకు అక్కడి జనసందోహం నీరాజనాలు పలికింది.
- సాయంత్రం 5 గంటలకు మెడికల్ కాలేజీ వద్దకు చేరుకున్నారు. నిర్మాణాలను పరిశీలించారు.
- సాయంత్రం 5.12 నుంచి 5.55 వరకు మీడియా సమావేశంలో మాట్లాడారు.
- సాయంత్రం 6.30కి మెడికల్ కాలేజీ నుంచి బయలుదేరారు.
- రాత్రి 8.15 గంటలకు కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న కురుపాం గిరిజన బాలికల హాస్టల్ విద్యార్థులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.
- రాత్రి 9.23 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు.
- రాత్రి 9.53 గంటలకు విమానంలో తిరుగుపయనమయ్యారు.

సమస్యలు వింటూ.. భరోసానిస్తూ..

ఆశ్రమ పాఠశాల విద్యార్థులను పరామర్శించిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి





కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

దాబాగార్డెన్స్: పచ్చకామెర్లతో బాధపడుతూ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న పార్వతీపురం జిల్లా కురుపాం మండలం శివన్నపేట గురుకులం ఆశ్రమ పాఠశాల హాస్టల్ విద్యార్థులను మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం రాత్రి పరామర్శించారు. కేజీహెచ్ పిల్లల వార్డులో చికిత్స పొందుతున్న సుచిత్ర, లాస్య, స్మైల్, భవిష్య, మాధవి, కీర్తన, సాయి, ప్రణవి, గ్రీష్మ, విద్యా, రమ్య, సంజన, అశ్విని, ధరణి, అఖిల, దీపిక, నీహారిక తదితర పిల్లల ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. కాసేపు పిల్లలతో ముచ్చటించారు. తాగునీరు, భోజనం బాగోలేదని విద్యార్థినులు చెప్పారు. ఆర్వో ప్లాంట్ పనిచేయడం లేదని, మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయని వాపోయారు. వార్డులో చికిత్స పొందుతున్న పిల్లలందర్నీ ఆప్యాయంగా పలకరించగా.. వారంతా సంతోషంగా వైఎస్ జగన్‌తో మాట్లాడారు.

ఎండకు భయపడలేదు.. వర్షానికి వెరవలేదు..

మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు జనం పోటెత్తారు. ఎయిర్‌పోర్టు నుంచి ప్రారంభమైన జనజాతర.. నర్సీపట్నం చేరేసరికి సముద్రంలా ఉప్పొంగింది. జై జగన్ అంటూ చేసిన నినాదాలతో జంక్షన్లు మార్మోగిపోయాయి. గోపాలపట్నం, వేపగుంట, చినముషిడివాడ, పెందుర్తి ప్రాంతాల్లో విశాలమైన బీఆర్‌టీఎస్ రహదారి కూడా జనసంద్రంగా మారిపోయింది. మధ్యాహ్నం 2 గంటలకు మండే ఎండలోనూ జగన్‌కు హారతులు పడుతూ.. పూలు జల్లుతూ, గజమాలలు వేస్తూ కరచాలనాలు చేశారు. అక్కడి నుంచి అనకాపల్లికి చేరుకున్న తర్వాత వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశం చిల్లు పడినట్లు ఒక్కసారిగా కుండపోత వర్షం కురిసింది. అయినప్పటికీ.. ఏ ఒక్కరూ వెనక్కు వెళ్లలేదు. ఆ జోరు వర్షంలోనే జగన్‌కు జేజేలు కొట్టారు. అనకాపల్లి నుంచి నర్సీపట్నం మెడికల్ కాలేజ్ వరకు జగన్‌ను జనసునామీలా చుట్టేశారు. కాన్వాయ్ కదిలేందుకు కూడా వీలులేకుండా బారులు తీరారు. అభిమానంతో ఉరకలెత్తుతున్న ప్రజల్ని చూసి వైఎస్ జగన్.. అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. నర్సీపట్నం చేరుకున్నాక జై జగన్ నినాదాలు మరింత మిన్నంటాయి. వైద్య కళాశాల వద్ద పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు జగన్‌కు స్వాగతం పలికారు.



వర్షంలోనే మహిళలతో మాట్లాడుతున్న జగన్





అభిమాన నేతకు అభివాదం



జి.భీమవరం వద్ద మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు పార్టీ నేత వీసం రామకృష్ణలకు ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాలు



అచ్చెర్ల జంక్షన్‌లో బుచ్చెయ్యపేట జెడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబును హెచ్చరిస్తున్న అనకాపల్లి డీఎస్పీ శ్రావణి

పోలీసుల ఓవరాక్షన్

జగన్‌మోహన్‌రెడ్డిని కలవకుండా అడ్డంకులు

నాతవరం: మాకవరపాలెం మండలంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల సందర్శనకు వస్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసేందుకు వచ్చిన వైఎస్సార్‌సీపీ శ్రేణులతోపాటు ప్రజా ప్రతినిధులను సైతం పోలీసులు అడ్డుకుని ఓవరాక్షన్ చేశారు. మాజీ ఎమ్మెల్యేలు కంబాల జోగులు, చెంగల వెంకటరావు, రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ, నక్కపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు కాసులమ్మ, ఎస్.రాయవరం, నక్కపల్లి, పాయకరావుపేట మండలాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ముఖ్య నాయకులు మాకవరపాలెం బయలు దేరారు. ఈ క్రమంలో కశింకోట మండలం జి.భీమవరం వద్ద ఎస్పీ తుహిన్ సిన్హా అడ్డుకుని అధిక సంఖ్యలో వెళ్లడానికి అనుమతులు లేవంటూ సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, లేకుంటే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. దాంతో వారంతా జి.భీమవరం ఆలయం వద్ద ఉండిపోయారు. అదే సమయంలో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కాన్వాయ్ రావడంతో తమ సమస్యలపై వినతి పత్రం ఇచ్చారు. కూటమి ప్రభుత్వం పేదలను ఇబ్బంది పెట్టి తమ ప్రాంతంలో ఏర్పాటు చేసే బల్క్ డ్రగ్ పార్కును అడ్డుకోవాలని కోరారు. భారీ వర్షాన్ని ఖాతరు చేయకుండా వారు చెప్పే సమస్యలను సావధానంగా విన్నారు. మీ వెంట నేను ఉన్నానని భరోసా ఇచ్చారు. పోలీసులు సమావేశానికి రాకుండా ఎన్ని ఆటంకాలు సృష్టించిన జగన్‌మోహన్‌రెడ్డిని కలిసినందుకు సంతోషంగా ఉందన్నారు.

జెడ్పీటీసీని అడ్డుకున్న డీఎస్పీ

బుచ్చెయ్యపేట జెడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు ఆధ్వర్యంలో చోడవరం నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, రైతులు కశింకోట మండలం అచ్చెర్ల జంక్షన్ వద్ద జగన్‌మోహన్‌రెడ్డిని కలిసేందుకు బయలు దేరారు. మార్గమధ్యంలో బారికేడ్లు అడ్డంగా పెట్టి అనకాపల్లి డీఎస్పీ శ్రావణి అడ్డుకున్నారు. తమ నియోజకవర్గంలో గోవాడ సుగర్ ఫ్యాక్టరీ సమస్యపై జగన్‌మోహన్‌రెడ్డికి వినతి పత్రం ఇవ్వడానికి అనుమతించాలని, ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా నడుచుకుంటామని కోరారు. అయినప్పటికీ చాలాసేపు బారికేడ్లు తీయలేదు. దాంతో ప్రజాప్రతినిధులు, రైతులు ఆగ్రహించారు. తమ నాయకుడిని కలిసేందుకు ఆంక్షలు విధించి అడ్డుకోవడమేమిటని నిలదీశారు. క్రమేపి వివాదం జఠిలం కాకముందే పోలీసులు బారికేడ్లు తొలగించారు.

ఆటంకాలు ఎదురైనా..



కశింకోట మండలం నర్సింగబిల్లి కూడలి వద్ద ఆటోను అడ్డగిస్తున్న పోలీసులు



అనకాపల్లి సమీపంలో చోడవరం సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావును అడ్డగించిన పోలీసులు

సాక్షి నెట్‌వర్క్: ప్రియతమ నాయకుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని చూడాలని, తమ బాధలు చెప్పుకోవాలని తండోపతండాలుగా వస్తున్న ప్రజలు, అభిమానులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. వందల సంఖ్యలో రంగంలోకి దిగిన పోలీసులు కార్లను, ఆటోలను ఆపి, అంతమంది వెళ్లడానికి వీల్లేదని ఆటంకపరిచారు. బైకుల మీద వెళుతున్నవారిని కూడా ప్రశ్నించారు. చివరకు ఆర్టీసీ బస్సులు కూడా ఆపి వైఎస్ జగన్‌ను కలిసేందుకు వెళుతున్నారేమోనని ఆరా తీసి, అనుమతి లేదని దింపేశారు.

అందుకే అనేక చోట్ల అభిమానులు తోటలు, పొలాల్లోంచి అడ్డదారిలో బైక్‌పై మాజీ సీఎంను చూసేందుకు వెళ్లారు.



పోలీసులను తప్పించుకొని కోటవురట్ల మండలం నగరం వద్ద మామిడి తోటల్లో నుంచి బైకులపై వెళుతున్న అభిమానులు

పేదలకు ఉచిత వైద్యం అందకుండా కుట్ర..



ప్రతి ఒక్కరికీ విద్య, వైద్యం ఉచితంగా అందించాలనే లక్ష్యంతోనే జగనన్న రాష్ట్రంలో 17 వైద్య కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పేదలకు ఉచితంగా వైద్యం చేరువ కావాలని ప్రతి జిల్లాలో మెడికల్ కళాశాలలకు గత ప్రభుత్వంలో శంకుస్థాపనలు చేశారు. ప్రభుత్వం మారితే ప్రైవేటుపరం చేస్తారా? పేదలకు ఉచితంగా వైద్యం కూడా అందించకుండా కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు విరమించుకోవాలనే జగనన్న అడుగులోనే మేము అడుగు వేశాం. ఆయన పోరాటానికి మద్దతుగా నిలబడాలనే వచ్చాను.

–పావని, తుమ్మపాల, అనకాపల్లి మండలం

జనం కోసమే జగన్

నర్సీపట్నం నియోజకవర్గం మాకవరపాలెం మండలం భీమబోయినపాలెం వద్ద నిర్మాణంలో ఉన్న వైద్య కళాశాల పరిశీలనకు వచ్చిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అడుగడుగునా పార్టీ శ్రేణులతోపాటు అభిమానులు, ప్రజలు బ్రహ్మరథం పట్టారు. మండుటెండలోనూ గంటల కొద్దీ నిరీక్షించి తమ అభిమాన నేతను కలుసుకున్నారు. ఆ సమయంలో జోరున కురిసిన వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ఆయన వెంట నడిచి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ను కలిసి తమ సాధకబాధకాలు చెప్పుకున్న కొంతమంది మనోభావాలు..

పేదింట్లో వైద్యులు ఉండకూడదా?



పేదవారికి వైద్య విద్యను అందించాలని, పేదింట్లో వైద్యులు ఉండాలని జగనన్న ఆశయం. దాంతోనే ప్రతి జిల్లాలో మెడికల్ కళాశాల ఉండాలని నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వాటిని ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తే పేద విద్యార్థులు ఎప్పటికి వైద్య రంగంలో అడుగుపెట్టలేరు. వైద్యాన్ని పూర్తిగా ప్రైవేటు పరం చేసి పేదవారిని దోచుకోవడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకూ జగన్‌తో పోరాటం చేస్తారు. ఆయన పోరాటానికి మద్దతుగా నిలవడానికే మేమంతా వచ్చాం.

–మచ్చా నరేష్, అరబుపాలెం, మునగపాక మండలం

జగనన్న కోసం ఎక్కడికైనా వస్తాం



జగనన్న కోసం ఎక్కడికైనా రావడానికి సిద్ధంగా ఉన్నాం. ఆయన్ను చూడటానికి మునగపాక నుంచి వచ్చాను. దారిలో అడుగడుగునా పోలీసులు అడ్డుకున్నారు. అయినా సరే వాళ్లను దాటుకుని పది కిలోమీటర్ల దూరం వచ్చాను. ప్రజల కోసం పోరాటం చేస్తున్న జగనన్నకు ప్రతి ఒక్కరూ తోడుగా నిలుస్తున్నారు. ఈ రోజు కూలీ పని వదులుకుని వచ్చాను. జగనన్నను చూశాను.

–వెలగ రాము, మునగపాక గ్రామం, మండలం

జగన్ ఓటమితో అందరూ చాలా బాధపడుతున్నారు



గత ఎన్నికల్లో జగనన్న ఓడిపోవడంతో అందరూ చాలా బాధపడుతున్నారు. ఆయన ప్రభుత్వంలో మాకు ఆర్థికంగా ఎంతో లబ్ధి కలిగింది. ఇప్పుడు కూడా జగనన్నను చూడ్డానికి జనం తండోపతండాలుగా స్వచ్ఛందంగా తరలివస్తున్నారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా సింహంలా వచ్చాడు అన్న. వర్షం కూడా లెక్కచేయకుండా జనం కోసం ఆయన పడే తపన చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతోంది. ఆయన బాగుంటేనే మహిళలందరికీ మేలు జరుగుతుంది. వచ్చే ఎన్నికల్లో ఆయన గెలుపును ఎవరూ అడ్డుకోలేరు. – కుప్పిలి మీనా, ఉగ్గినపాలెం, కశింకోట మండలం

కూటమి హామీలన్నీ మోసమే



గత ఎన్నికల్లో గెలవడానికి కూటమి పెద్దలు ఇచ్చిన హామీలన్నీ ప్రజల్ని మోసగించడానికే. చంద్రబాబుకు వెన్నుపోటు అలవాటే. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నరైనా ఆడబిడ్డ నిధి పథకం అమలు చేయలేదు. కొత్త పింఛన్లు ఎవ్వరికీ మంజూరు చేయలేదు. అంతా పచ్చ మీడియా ప్రచారం తప్పితే కూటమి ప్రభుత్వంలో ప్రజలకు ప్రయోజనం ఏమీ లేదు. మళ్లీ జగనన్న ప్రభుత్వం వస్తేనే పేదలకు మేలు. గత ఎన్నికల తర్వాత మొదటిసారి జిల్లాకు వస్తున్న జగనన్నను చూడ్డానికి మా ఊరి నుంచి భారీగా ఇక్కడకు తరలివచ్చాం. – అధికారి వెంకటేశ్వరరావు, చింతలపాలెం, కశింకోట మండలం

ఫ్లెక్సీతో జోగినాయుడు



నాతవరం: మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మాకవరపాలెంలో కలసి సంఘీభావం తెలిపేందుకు సినీ నటుడు జోగినాయుడు గురువారం ఉదయం నాతవరంలో బయలుదేరారు. పోలీసులు అడుగునా అనేక అటంకాలు కలిగించారు. అయినప్పటికీ ఆయన వెనక్కి తగ్గకుండా మెడికల్ కాలేజీకి చేరుకోని ఆయన సొంతంగా తయారు చేసుకున్న ఫ్లెక్సీలు పట్టుకోని నిరసన వ్యక్తం చేసారు.

భారీ పోలీసు బందోబస్తు



మెడికల్ కళాశాల మార్గంలో బారికేడ్లు ఏర్పాటు చేస్తున్న పోలీసులు



సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

మాకవరపాలెం: మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు భారీ ఎత్తున పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. మండలంలోని భీమబోయినపాలెం వద్ద మెడికల్ కళాశాల భవనాల సందర్శనకు జగన్ రావడంతో సుమారు 800 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. గురువారం ఉదయం 6 గంటల నుంచే పోలీసులు భారీగా మెడికల్ కళాశాల ప్రాంతానికి చేరుకున్నారు. కళాశాలకు వెళ్లే మార్గంలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. వాహనాలను లోనికి వెళ్లకుండా నిలిపివేశారు. మధ్యాహ్నం జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మెడికల్ కళాశాల భవనాల వద్దకు చేరుకుని భద్రత ఏర్పాట్లు పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

జగన్‌కు భయపడి అడ్డంకులు సిగ్గుచేటు

అనకాపల్లి: మాది మంచి ప్రభుత్వమని ప్రచార ఆర్భాటాలు చేసి గొప్పలు చెప్పుకునే కూటమి పాలకులు ప్రతిపక్ష నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డిని చూసి భయపడటం సిగ్గుచేటని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు వియ్యపు రాజు గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనకాపల్లి జిల్లాకు వస్తున్న సందర్భంగా సాధారణ ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేసి నియంత్రించడం దుర్మార్గమన్నారు. ఎక్కడికక్కడ పోలీసుల ద్వారా ట్రాఫిక్‌కి అంతరాయం కలిగించి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వానికి రానున్న రోజుల్లో ప్రజలే బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. సిగ్గుమాలి పనులు మానుకుని సూపర్‌సిక్స్ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయడం కోసం ఆలోచన చేయాలని ఎద్దేవా చేశారు.

బల్క్‌డ్రగ్ పార్క్ సమస్యపై వినతిపత్రం



తాళ్లపాలెం సమీపంలో బల్క్‌డ్రగ్ పార్క్ సమస్యను జగన్‌మోహన్‌రెడ్డికి వివరిస్తున్న వీసం రామకృష్ణ

నక్కపల్లి: రాజయ్యపేట సమీపంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న బల్క్‌డ్రగ్ పార్క్‌ను వ్యతిరేకిస్తూ మత్స్యకారులు చేస్తున్న ఆందోళనను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ తెలిపారు. పాయకరావుపేట సమన్వయకర్త కంబాల జోగులు, మండల మత్స్యకార నాయకులతో కలిసి గురువారం తాళ్లపాలెం సమీపంలో జగన్‌కు ఈ సమస్య గురించి వివరించినట్టు పేర్కొన్నారు. అత్యంత ప్రమాదకర కాలుష్యాన్ని వెదజల్లే బల్క్‌డ్రగ్ పార్క్ వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ వినతిపత్రం అందజేశామన్నారు. వేట మానుకుని నిరాహార దీక్ష చేస్తున్న తమపై పోలీసులు కేసులు పెట్టి ఆంక్షలు విధిస్తున్నారని, తమకు మద్దతుగా వచ్చే వివిధ పార్టీల నాయకులను, ప్రజాసంఘాలను అడ్డుకుంటున్నారని మత్స్యకార నాయకులు వివరించారని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన వారిలో మత్స్యకార నాయకులు ఎరిపల్లి నాగేశు, చోడిపల్లి శ్రీను, ఎరిపల్లి ముసలయ్య, అప్పలరాజు, సూరిబాబు, పిక్కి తాతీలు నూకరాజు, గొర్ల బాబూరావు, తళ్ల భార్గవ్, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, ఎంపీటీసీలు గంటా తిరుపతిరావు, గొర్ల గోవిందు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు ముఖ్య నాయకులు ఉన్నారు.

గోవాడ సుగర్స్‌ను ఆదుకోవాలని రైతుల అభ్యర్థన

చోడవరం: గోవాడ సుగర్ ఫ్యాక్టరీని, చెరకు రైతులను ఆదుకోవాలని కోరుతూ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీప అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి చోడవరం, మాడుగుల నియోజకవర్గాలకు చెందిన చెరకు రైతులు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కొత్తూరు జంక్షన్ వద్ద వినతిపత్రం ఇచ్చారు. గతేడాదికి సంబంధించిన చెరకు బకాయిలు రైతులకు ఫ్యాక్టరీ ఇంకా చెల్లించలేదని, కార్మికులకు ఆరు నెలలుగా జీతాలు చెల్లించలేదని, ఈ ఏడాది క్రషింగ్ చేస్తారో చేయరో తెలియని అగమ్య పరిస్థితిలో ఫ్యాక్టరీ, రైతులు ఉన్నారని, ప్రభుత్వం తక్షణ సాయంగా రూ.50 కోట్లు ఇచ్చి ఫ్యాక్టరీని ఆదుకునేలా రైతులకు మద్దతు ఇవ్వాలని రైతులంతా జగన్‌మోహన్‌రెడ్డికి విన్నవించుకున్నారు. దీనిపై ఆయన స్పందించి, రైతులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. రైతులతో పాటు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఏడువాక సత్యారావు, సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు, ఎంపీపీ గాడి కాసు అప్పారావు, వైస్ ఎంపీపీ శరగడం నాగేశ్వరరావు, ఎంపీటీసీ సూరిశెట్టి నాగదుర్గ గోవింద, పార్టీ నాయకులు, చెరకు రైతులు శరగడం చిమ్మినాయుడు, ఎంపీటీసీలు గూనూరు రాజు, గూనూరు రామకృష్ణ, గాడి అప్పారావు, బూరే మాణిక్యం, రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు

WANTED
Wanted Experienced
Marketing Manager (M/F)
➤ Qly: Degree ➤ Salary: 25000/-
BDO / Executives (M/F)
➤ Qly : Inter
➤ Salary : 12000/- + TA, DA
Interested resume to [illegible]
7995474515, 8405870102

అమ్మా.. బల్క్‌డ్రగ్ పార్క్ రద్దు భారం నీదే..





రాజయ్యపేటలో ఉన్న అమ్మవారి ఆలయం ఎదుట నీళ్ల బిందెలతో మత్స్యకార మహిళలు, (ఇన్‌సెట్) బాకీర్తమ్మ ఆలయం

- రాజయ్యపేటలో బాకీర్తమ్మకు మత్స్యకారుల పూజలు

నక్కపల్లి: 'అమ్మా బాకీర్తమ్మ.. మమ్మల్ని కంటికిరెప్పలా కాపాడుతున్నావు.. నిన్నే నమ్ముకున్నాం.. ప్రాణాలకు తెగించి వేట సాగిస్తూ పూటగడుపుకొంటున్నాం.. అటువంటి మాపై కూటమి ప్రభుత్వం కక్ష గట్టింది.. బల్క్ డ్రగ్ పార్క్ రూపంలో రాజయ్యపేట మత్స్యకారుల మనుగడకు ముప్పు కలిగించేందుకు ఒడిగట్టింది.. నీవే కాపాడాలమ్మా'అంటూ రాజయ్యపేట మత్స్యకారులు గురువారం వేడుకున్నారు. గ్రామంలో మత్స్యకారులంతా బాకీర్తమ్మ ఆలయం వద్దకు చేరుకుని బిందెలతో నీళ్లు ఆలయ మెట్లపై పోస్తూ అమ్మవారిని ప్రార్థించారు. రాజయ్యపేట సమీపంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న బల్క్ డ్రగ్ పార్క్‌కు వ్యతిరేకంగా మొట్టమొదటగా బాకీర్తమ్మ ఆలయం సమీపంలోనే 25 రోజుల కిందట నిరసన కార్యక్రమం ప్రారంభించారు. అప్పటి నుంచి వేట, ఉపాధి పనులు మానుకుని మత్స్యకారులంతా నిరాహార దీక్ష చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం మహిళలంతా బిందెలతో నీళ్లు పట్టుకుని బాకీర్తమ్మ ఆలయం వద్దకు చేరుకున్నారు. సంప్రదాయ పద్ధతిలో ఆలయం ముందు నిళ్లు పోసి అమ్మవారిని ప్రార్థించారు. 'నీ పాదాల చెంత నుంచే ఉద్యమం ప్రారంభించాం.. మా ఆరాధ్య దైవం నూకతాత ఆశీస్సులతో కొనసాగిస్తున్నాం.. బల్క్ డ్రగ్ పార్క్ రద్దు చేసే బాధ్యత మీదేనమ్మా'అంటూ వేడుకున్నారు.

లారీ ఢీ.. క్లీనర్ మృతి

అనకాపల్లి టౌన్: లారీ ఢీకొన్న సంఘటనలో మరొక లారీ క్లీనర్ మృతి చెందాడు. రూరల్ ఎస్ఐ రవికుమార్ వివరాలు ప్రకారం.. నర్సీపట్నం మండలం శ్రీరామపురం గ్రామానికి చెందిన పైలా కిరణ్(22) విశాఖపట్నానికి చెందిన ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. తన విధుల్లో భాగంగా గంగవరం పోర్టు నుంచి మాకవరంపాలెం గ్రామానికి లారీతో వెళ్తున్నాడు. మార్గమధ్యంలో అనకాపల్లి మండలం సిరసపల్లి గ్రామం జాతీయ రహదారి వద్ద వోల్వా బస్సును తప్పించబోయి అదే రూట్‌లో వెళ్తున్న మరొక లారీని బలంగా ఢీ కొన్నాడు. ఈ సంఘటనలో రెండో లారీ క్లీనర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు మృతుడు మేనమామ సరికొండ చినబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి పట్టివేత

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్లో గురువారం రైల్వే పోలీసులు గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయ నాయుడు ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది సంయుక్తంగా ప్లాట్‌ఫాంలలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో మహారాష్ట్రలోని రాయిగఢ్ జిల్లాకు చెందిన శశాంక్ జితేంద్ర చౌహాన్, శంకర్ ప్రభురెడ్డి..ముంబైకి అక్రమంగా గంజాయిని తరలిస్తుండగా పట్టుబడ్డారు. వారి నుంచి రూ. 1,92,400 విలువైన 38.48 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

మెడ కోసుకుని వ్యక్తి ఆత్మహత్య

తాటిచెట్లపాలెం: పోర్ట్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామచంద్రనగర్‌లో గద్ది రాజేష్ అనే వ్యక్తి కత్తితో మెడ కోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోర్ట్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రాజేష్ తన తల్లి పద్మ, భార్య లక్ష్మితో కలిసి నివాసం ఉంటున్నాడు. గురువారం ఉదయం భార్య లక్ష్మి బయటకు వెళ్లగా, రాజేష్ బాత్రూమ్‌లోకి వెళ్లి ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. కొద్దిసేపటి తర్వాత కుమారుడు రక్తపు మడుగులో ఉండడం చూసి తల్లి పద్మ, కోడలు లక్ష్మికి ఫోన్‌లో సమాచారం అందించింది. ఇంటికి చేరుకున్న లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. భార్యభర్తల మధ్య మనస్పర్థలే ఆత్మహత్యకు కారణమై ఉండవచ్చని స్థానికులు అనుమానిస్తున్నారు.

నిందితుడికి రిమాండ్

అల్లిపురం: లైంగిక దాడి కేసులో రెండేళ్లుగా తప్పించుకు తిరుగుతున్న నిందితుడ్ని మహారాణిపేట పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ప్రకాశం జిల్లా చీరాలకు చెందిన పదార్థి వీరేంద్ర అలియాస్ చెర్రీపై 2017లో నమోదైన లైంగిక దాడి కేసులో అరెస్టు అయి బెయిల్‌పై విడుదలయ్యాడు. కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా పోలీసుల కళ్లు గప్పి తిరుగుతున్నాడు. ఈ నేపథ్యంలో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

జాతీయ ఆహార కమిషన్ సభ్యుడు ఆకస్మిక తనిఖీలు



యలమంచిలి జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న జాతీయ ఆహార కమిషన్ సభ్యుడు కాంతారావు

యలమంచిలి రూరల్: జాతీయ ఆహార కమిషన్ సభ్యుడు బి.కాంతారావు గురువారం యలమంచిలి పట్టణంలో రేషన్ డిపోలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. జాతీయ ఆహార భద్రత చట్టం 2013 అమలును పరిశీలించిన ఆయన పలు లోపాలు గుర్తించి ప్రజలకు నాణ్యమైన ఆహారం అందేలా చూస్తున్నామన్నారు. తొలుత యాతపేటలో ఉన్న రేషన్ డిపోలో బియ్యం నేలపై వినియోగదారులకు సరఫరా చేస్తున్నందున మెమో జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. మరో రెండు రేషన్ షాపుల్లో బియ్యం అపరిశుభ్ర పరిస్థితుల్లో సరఫరా చేస్తున్నట్టు గుర్తించి డీలర్లను హెచ్చరించారు. అనంతరం సమీపంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి పిల్లలకు అందించే పోషకాహారంలో నాణ్యతా లోపం ఉండకూడదని నిర్వాహకులకు సూచించారు. పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాల, కొత్తపేట జెడ్పీ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. బాలికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో పిల్లలకు వడ్డిస్తున్న ఆహార పదార్థాలను అధికారులతో కలిసి రుచి చూశారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి ఉప విద్యాశాఖాధికారి అప్పారావు, పౌర సరఫరాలు, తూనికలు కొలతలు, ఆహార భద్రత, సంక్షేమ హాస్టళ్ల అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ ఫలాలు అందించేందుకు కృషి



మాట్లాడుతున్న రాష్ట్ర కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ ఈశ్వరరావు

రావికమతం: ప్రభుత్వ సంక్షేమ ఫలాలు కుమ్మరి, శాలివాహన వృత్తిదారులకు అందించేందుకు కృషి చేస్తామని రాష్ట్ర కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ పెరిపి ఈశ్వరరావు తెలిపారు. జిల్లా శాలివాహన సంఘం సభ్యుల సమావేశం గురువారం కొత్తకోటలో జరిగింది. ఆయన మాట్లాడుతూ కుల వృత్తిపై ఆధారపడి జీవించాలన్నారు. 50 ఏళ్ల నిండిన వారికి సామాజిక భద్రతా పింఛన్ మంజూరు చేయాలని, ప్రతి జిల్లాలో కుమ్మరి శాలివాహన భవనం నిర్మించాలని, పలు సమస్యలును సీఎం చంద్రబాబును కోరగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. సమస్యల పరిష్కారానికి త్వరలో విజయవాడలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు. కుమ్మరి కులాలను రాజకీయ, సామాజిక అంశాల్లో గుర్తించడం లేదని మాజీ చైర్మన్ తుగ్గల నాగేంద్ర తెలిపారు. రాష్ట్రంలో 10 లక్షలకు పైగా జనాభా ఉన్న కుమ్మరి కులస్తులకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ వంటి పదవులు ఇవ్వడం లేదని సంఘం ప్రతినిధి మండెంపూడి పురుషోత్తం వాపోయారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పొన్నాడ అప్పలకొండ, రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ దాలిపర్తి వేమన, మండల సంఘం నాయకులు మల్లి చిరంజీవి, నక్కా చినబ్బాయి, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

LOST DOCUMENTS
I, V JOHN PRASANNA KUMAR S/o V. Samuel Resident of Door No 15-6-4 , ZP Junction, Maharanipeta, Visakhapatnam. I have lost original sale deeds of agricultural land around Elamanchili bus stand while travelling on 09-10-2025 bearing Doc No.s 1106 /1964 , 1107/ 1964 & 2052/1964. If found kindly return to above address or contact Phone 9177310510, 9866323707

Wanted

■ హైదరాబాద్‌లో కేర్‌టేకర్స్ కావలెను. జీతం: 18-20 వేలు. సంవత్సరంలోపు 22-25 కి పెరిగే అవకాశం,వయస్సు 20-45లోపు ఉచిత భోజనం వసతి ESI PF కలదు. + 91 76809 22316 [G-792]

■ Hyd రియల్ ఎస్టేట్ Co. కై మార్కెటింగ్ Exe కోకాపేట్, శంకర్‌పల్లిలో విల్లాస్, ప్లాట్స్ సేల్స్ కై జీ+కమీ+2 వీలర్+ రూం+ భో+ ఫ్రీ. A:32, నె.లక్ష రూ. ఫ్రెష్/Exp: 8341224354 [HA-15628]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ : 18K-20K. Ph : 9640400073, 9160900024 [SCA25008783]

Real Estate

LAND FOR SALE
■ ఫ్లాష్! ఫ్లాష్! వినుకొండ, పల్నాడు జిల్లాలో 133.33 గజాలు కేవలం 1,00,000/- మాత్రమే 300 ప్లాట్లు మాత్రమే కలవు. లిమిటెడ్ ఆఫర్ ఫోన్: 9133574455 [HA-4654]

Services

GOLD LOANS
■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 14303]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

అనకాపల్లి	: 9010546644
యలమంచిలి	: 9951602901
చోడవరం	: 9010210265
నర్సీపట్నం	: 9010234557
పాడేరు	: 9010973030

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

క్లుప్తంగా

ఘనంగా మరిడిమాంబ ఉత్సవం



మరిడిమాంబను దర్శించుకుంటున్న ప్రజలు

కశింకోట: మరిడిమాంబ ఉత్సవం గురువారం కశింకోటలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్థానిక కనకమహాలక్ష్మి వీధి, కస్పావీధి ప్రాంతాల్లో మరిడిమాంబ ఆలయాలను భక్తులు ఎక్కువగా దర్శించుకున్నారు. చీరలు, రవికెలు, అరటి గెలల రూపంలో అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను ఊరేగించారు. రాత్రికి ఆయా ఆలయాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

నేత్ర శస్త్రచికిత్సలకు 24 మంది ఎంపిక

అనకాపల్లి టౌన్: మండలంలోని మారేడిపూడిలో ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. సర్పంచ్ సాలాపు కనకరాజు ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ శిబిరంలో ఆప్తాలమిస్ట్ వంద మంది రోగులకు కంటి పరీక్షలు చేశారు. వీరిలో 24 మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేసి విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి ప్రత్యేక బస్సులో తరలించారు. చూచుకొండ రమణ, గ్రామ పెద్దలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గృహ విద్యుత్ చార్జీలను సవరించాలి

అనకాపల్లి: విద్యుత్ బిల్లులను చూస్తుంటే వినియోగదారులు బెంబేలెత్తుతున్నారని, వాటిని తగ్గించాలని సిద్దార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దశలు వారీగా చార్జీలు తగ్గిస్తామని కూటమి అధికారం చేపట్టిన తర్వాత వినియోగదారునికి తెలియకుండా పెంచడం దారుణమన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో గృహ వినియోగానికి 1 నుంచి 50 యూనిట్లు వరకు రూ.1.45పైసలు, రెండో శ్లాబ్ 51–100 యూనిట్లు వరకూ రూ.2.60 పైసలు, మూడో శ్లాబ్ 101 నుంచి 225 వరకూ రూ.3.60 ఉండేదన్నారు. కూటమి పాలనలో 1–30 యూనిట్లుకు రూ.1.90పైసలు, రెండో శ్లాబ్ 31 నుంచి 75 యూనిట్లకు రూ.3.5 పైసలు, మూడో శ్లాబ్ 75 నుంచి 125 యూనిట్లు వరకూ రూ.4.83 పైసలుగా పెంచి అధికంగా వసూలు చేస్తుందన్నారు. ఇంధనం సర్దుబాటు చార్జీలు నిమిత్తం అదనంగా మూడు రకాలు పెంచి పెనుభారం మోపిందన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

పెందుర్తి: పెందుర్తి పాతూరులో నివాసం ఉంటున్న పాటి రామకృష్ణ(34) కొంత కాలంగా మానసిక రుగ్మతతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పెందుర్తి పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 158 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,500	5,200
రెండో రకం	4,000	4,490
మూడవ రకం	3,800	3,800

అనకాపల్లి సినిమాలు

రాజా	: ఇడ్లీ కొట్టు (ఉదయం, మధ్యాహ్నం)
రాజా	: శశివర్ధన్ (ఫస్ట్, సెకండ్‌షో)
సత్యనారాయణ స్క్రీన్-1	: కాంతార
సత్యనారాయణ స్క్రీన్-2	: టీఆర్‌ఓఎన్ ఏఆర్ ఈఎస్(తెలుగులో)
పర్తిసాయి	: ఓజీ
షిర్డిసాయి	: అరి
వెంకటేశ్వర	: కానిస్టేబుల్
రామచంద్ర	: మిరాయ్

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 90 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-20, బీ పాజిటివ్-28, ఓ పాజిటివ్-36, ఏబీ పాజిటివ్-6 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యాలోకేష్(9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 395 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 332 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (08924-223595)ని సంప్రదించవచ్చు.



వైఎస్సార్ సీపీ స్లోగన్ బనియన్లతో పార్టీ శ్రేణులు



తీన్‌మార్ దప్పుల మోత



నిరీక్షిస్తున్న ఎంపీపీ కలగా లక్ష్మితో పాటు పార్టీ నాయకులు



తాళ్లపాలెం హైవేపై పార్టీ శ్రేణుల ఎదురు చూపులు

జగనన్న వెంటే మేమంతా..

- అడుగడుగునా పోలీసుల ఆటంకాలు
- వాటిని ఛేదించి పెద్ద ఎత్తున తరలివచ్చిన పార్టీ శ్రేణులు, జనం
- వర్షాన్ని సైతం లెక్క చేయకుండా నీరాజనాలు



కొత్తూరు జంక్షన్ వద్ద పార్టీ శ్రేణులతో నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్



తాళ్లపాలెం రోడ్ షోకు వర్షంలోను జన నీరాజనం



కొత్తూరు జంక్షన్ వద్ద ఎంపీపీ గొర్లి సూరిబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, పార్టీ శ్రేణులు

జగనన్న వెంటే మేమంతా.. అంటూ పార్టీ శ్రేణులు, అభిమానులు, జనం పెద్ద ఎత్తున తరలివచ్చారు. పోలీసుల ఆంక్షల వలయాన్ని ఛేదించుకుని వర్షాన్ని సైతం లెక్క చేయకుండా దారి పొడవునా గంటలకొద్దీ నిరీక్షించి ఆయనకు నీరాజనాలు పలికారు.

అనకాపల్లి: అనకాపల్లి జాతీయ రహదారి మీదుగా నర్సీపట్నం నియోజకవర్గం మాకవరపాలెం మండలంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణ పనులను పరిశీలనకు వెళ్తున్న మాజీ సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని కలిసేందుకు అనకాపల్లి, చోడవరం, మాడుగుల నియోజకవర్గ ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో అనకాపల్లి మండలం కొత్తూరు జంక్షన్‌లో ఏఎంఏఎల్ కళాశాల వద్దకు చేరుకున్నారు. తమ ప్రియతమ నేతను చూసేందుకు మండుటెండలోనూ గంటల కొద్దీ నిరీక్షించారు. విశాఖ విమానాశ్రయం నుంచి పెందుర్తి, సబ్బవరం మండలాల మీదుగా అనకాపల్లి వస్తున్న సమయంలో జాతీయ రహదారి కొత్తూరు జంక్షన్‌కు వచ్చేసరికి ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. ఈ వర్షాన్ని సైతం లెక్క చేయకుండా జాతీయ రహదారిలో జగన్‌మోహన్‌రెడ్డిని కలుసుకున్నారు. జోరు వర్షంలోనూ తన కాన్వాయ్ దిగి కార్యకర్తలతో మమేకమై నడవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయింది. 2029 సార్వత్రిక ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటామని ముక్తకంఠంతో నినాదాలు చేశారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ ఆధ్వర్యంలో అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు ఈ నెల 6న మండల సర్వసభ్య సమావేశంలో మెడికల్ కళాశాలను పీపీపీ పద్ధతిలో ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించవద్దని ఏకగ్రీవంగా తీర్మాణ పత్రాన్ని, చోడవరం మండలం గోవాడ సుగర్ ఫ్యాక్టరీని 2025–26 సీజన్‌లో నడుపుటకు రూ.35 కోట్లు ప్రభుత్వ ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, గోవాడ గ్రామ సర్పంచ్ ఏడువాకల సత్యారావు, చెరకు రైతులు మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

పోలీసులు అడ్డుకున్నా..

జగన్ పర్యటన నేపథ్యంలో గురువారం తెల్లవారుజాము నుంచి మార్టూరు జంక్షన్, కె.ఎస్.ఆర్‌పేట జంక్షన్, కుంచంగి, కూండ్రం గ్రామాల్లో భారీగా పోలీస్ పికెటింగ్ నిర్వహించారు. తెల్లవారు జాము 5 గంటల నుంచి అనకాపల్లి పట్టణానికి వచ్చే ఆటోలు, ద్విచక్రవాహనాలు, కారులు, బస్సులను విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించారు. మండలం నుంచి పట్టణానికి వివిధ కూలి పనులపై వచ్చే ప్రజలను అడ్డుకున్నారు. అయినప్పటికీ ప్రత్యామ్నాయ మార్గాల్లో అనకాపల్లి జాతీయ రహదారి కొత్తూరు జంక్షన్‌కు ప్రజలు చేరుకున్నారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు భారీ ఎత్తున తరలిరావడంతో వెయ్యి మంది పోలీస్‌లు రహదారిపైకి రాకుండా అడ్డుకున్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని జాతీయ రహదారికి దూరంలో టెంట్ వేస్తే దాన్ని తక్షణమే తొలగించాలని పోలీసులు ఆదేశించారు. మాజీ ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, పార్టీ పార్లమెంట్ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్, యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, రాష్ట్ర పార్టీ మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్లె అనురాధ టెంట్‌లో కూర్చోని లేవకపోవడంతో పోలీసులు నిస్సహాయతతో వెనుతిరిగారు. జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు జాతీయ రహదారిపైకి రాకుండా బారికేడ్లు, రోప్‌లు కట్టి పోలీస్‌లు బందోబస్తును ఏర్పాటు చేశారు. జాతీయ రహదారిలో రేబాక జంక్షన్, పూడిమడక జంక్షన్ వద్దకు భారీ ఎత్తున పార్టీశ్రేణులు, ప్రజలు చేరుకని జగన్ కాన్వాయ్‌కు అడ్డంగా నిలబడిపోవడంతో పోలీసులకు చేష్టలుడి చూస్తుండిపోయారు. అప్పటికే కొత్తూరు జంక్షన్‌కు వస్తున్న జగన్‌ను చూసేందుకు పార్టీ నాయకులు, ప్రజలు పోలీస్‌లను నెట్టుకుని జాతీయ రహదారిపైకి వచ్చి నిలబడి జై జగన్..జైజై జగన్.. మన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి... అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. భారీ వర్షంలో నడుచుకుంటూ వెళ్తూ కార్యకర్తల్లో జోష్‌ను నింపారు.

తప్పెటగుళ్లు, తీన్‌మార్...

జాతీయ రహదారి జంక్షన్ వద్ద తప్పెటగుళ్లు, తీన్‌మార్ పార్టీ శ్రేణులను ఎంతగానో అకట్టుకున్నాయి. ఒకనొక సమయంలో పోలీస్‌లు రెండు నేలవేషాలను తక్షణమే నిలుపుదల చేయాలని కోరినప్పటికి ప్రజలు వ్యతిరేకించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి మలసాల కుమార్‌రాజా, ఎంపీపీ గొర్లి సూరిబాబు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, 80 వార్డు ఇన్‌చార్జి కె.ఎం. నాయుడు, జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షుడు పల్లేల సాయి, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా కార్యదర్శి నీటిపల్లి లక్ష్మి, మాజీ ఎంపీపీ మలసాల ధనమ్మ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

కశింకోట: మండలంలోని తాళ్లపాలెంలో కూడలిలో భారీ వర్షంతో వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తడిసి ముద్దయ్యారు. మాకవరపాలెం మెడికల్ కళాశాల భవనం పరిశీలనకు వస్తూ ఇక్కడ రోడ్ షో నిర్వహించారు. ఆయన చేరుకోవడానికి పది నిమిషాల ముందు నుంచి తాళ్లపాలెంలో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం ప్రారంభమై కుండపోతగా కురవ సాగింది. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం 3.20 గంటల ప్రాంతంలో చేరుకొని వర్షాన్ని లెక్క చేయకుండా తడుస్తూనే కారు నుంచి పైభాగానికి వచ్చి చిరునవ్వులు చిందిస్తూ తన ముకుళిత హస్తాలతో అభివాదం చేస్తూ రోడ్ షో నిర్వహించారు. ప్రజలకు రోడ్డుకు రెండు వైపులా అందరికి తాను కనిపించే విధంగా తిరిగి అభివాదం చేశారు. జనం, వైఎస్సార్ సీపీ శ్రేణులు కూడా వర్షంలో తడుస్తూనే రెండు గంటలు పైగా ఎదురు చూస్తూ నిరీక్షించి ఆయనకు నీరాజనాలు పలికారు. కొందరు ఆయనను దగ్గరగా చూడటానికి, చేతులు అందించి కరచాలనం చేయడానికి ఎంతో ఉత్సాహంగా ఎగబడ్డారు. అందరికి తమ ముకుళిత హస్తాలతో అభివాదం చేస్తూ మాకవరపాలెం వైపు కాన్వాయ్‌తో తరలి వెళ్లారు. ఆయనకు పార్టీ శ్రేణులు, అభిమానులు, జనం ఎదురేగి వెళ్లి ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా తీన్‌మార్ డప్పుల మోతతో పలువురు పార్టీ శ్రేణులు పార్టీ నినాదాలతో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త రూపొందించిన బనియన్లు ధరించి ఉత్సాహంతో నృత్యాలు చేశారు. పలువురు పెద్ద జెండాలు చేతబూని కలియ తిరిగారు. పోలీసులు కూడా జి. భీమవరం వద్ద పలు సమస్యలపై వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వినతి పత్రాలు అందజేశారు. కన్నూరుపాలెంలో ఆయనకు ప్రజలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి ఘనంగా నీరాజనాలు పలికారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు మలసాల కిషోర్, ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, పార్టీ మండల సచివాలయ కన్వీనర్ కలగ గున్నయ్య నాయుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, పార్టీ యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు, పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి మలసాల కుమార్‌రాజా, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు పెంటకోట శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యురాలు లగిశెట్టి భవాని తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అత్యుత్సాహం:

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రోడ్డు షో సందర్భంగా పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. కశింకోట, బయ్యవరం, జమాదులపాలెం, పరవాడపాలెం, అచ్చెర్ల రోడ్ తదితర ప్రాంతాల్లో బారికేడ్లను అడ్డంగా నిలిపి శ్రేణులు, జనం రాకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారు. అచ్చెర్ల రోడ్ వద్ద డీఎస్పీ శ్రావణి అడ్డుకోవడంతో బుచ్చెయ్యపేట జెడ్పీటీసీ సభ్యుడు దొండ రాంబాబు వాగ్వాదం చోటు చేసుకుంది. ఇందుకు తీవ్ర అభ్యంతరం వ్యక్తం కావడంతో ఆ తర్వాత శ్రేణులను విడిచిపెట్టారు. వారు వేర్వేరు మార్గాల ద్వారా చేరడం, పార్టీ నాయకులు పోలీసు అధికారుల వద్ద గట్టిగా అభ్యంతరం తెలపడంతో ఆనక పోలీసులు విడిచి పెట్టారు. నరసింగబిల్లిలో వాహనాలు, ఆటోల్లో వెళుతున్న ప్రజలను పోలీసులు అభ్యంతరం తెలుపుతూ అడ్డుకున్నారు. అడ్డంకులు కల్పించినప్పటికి తాళ్లపాలెం రోడ్ షోకు స్వచ్ఛందంగా చేరుకున్నారు. తాళ్లపాలెం కూడలిలో పార్టీ శ్రేణులను జగన్‌మోహన్‌రెడ్డి వచ్చే సమయం వరకు కట్టడి చేసి ఆ తర్వాత విడిచి పెట్టారు. తాళ్లపాలెం కూడలిలో బారికేడ్లు అడ్డు పెట్టి నర్సీపట్నం వైపు వెళ్లే బస్సులకు ప్రత్యామ్నాయ మార్గం చూపకుండా నిలిపి వేయడంతో ప్రయాణికులు ఇబ్బంది చెందారు. అనకాపల్లి–యలమంచిలి మార్గంలో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగింది. పోలీసు అధికారులు, సిబ్బంది కూడా వర్షం అయినా వెరవకుండా బందోబస్తు విధులు నిర్వహించారు. ట్రైనీ ఎస్పీ, డీఎస్పీ, సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



తీన్‌మార్ దప్పులు



కొత్తూరు జంక్షన్ వద్ద తప్పెటగుళ్లు



తరలివస్తున్న మారేడుపూడి పార్టీ శ్రేణులు



కొత్తూరు జంక్షన్‌కు నడుచుకుంటూ వస్తున్న పట్టణ అధ్యక్షుడు జానకీరామరాజు, నాయకులు



మార్టూరు జంక్షన్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీస్‌లు



తాళ్లపాలెం కూడలిలో రోడ్ షోకు హాజరైన వైఎస్సార్ సీపీ శ్రేణులు, జనం



వర్షంలో గొడుగు నీడలో పోలీసులు



కశింకోటలో బారికేడ్లతో పోలీసుల బందోబస్తు

జగనన్న మళ్లీ సీఎం కావాలి



మాకవరపాలెం వద్ద మెడికల్ కళాశాల పరిశీలనకు వచ్చిన మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ చూడటం ఎంతో ఆనందంగా ఉంది. ఆయన హయాంలో అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేసి ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం పొందారు. మళ్లీ ఆయన ముఖ్యమంత్రి కావాలని ఆశిస్తున్నాం.

– మాదెపు రాజు, మోసయ్యపేట, కశింకోట

చాలా ఆనందంగా ఉంది



పోలీసులు అడ్డంకులు కల్పించినప్పటికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అభిమానంతో తాళ్లపాలెం రోడ్ షోకు రావడం జరిగింది. ఆయనను చూడటం ఎంతో ఆనందాన్ని కలిగించింది.

–బొడ్డేడ చిరంజీవిరావు, అచ్చెర్ల, కశింకోట

జగనన్న వెంట యువత



జగనన్న నాడు– నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చి ప్రతి పేద విద్యార్థికి మెరుగైన విద్య అందించారు. ప్రతి పేదోడికి వైద్యం కూడా అందించాలని, ఇతర రాష్ట్రాలకు పోవాల్సిన అవసరం లేకుండా మన జిల్లా, పక్క జిల్లాలోనే మెడికల్ సీటు పొంది ఎంబీబీఎస్ చదువుకునే విధంగా రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలల నిర్మాణాలను ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం వాటిని ఎలా ప్రైవేటుపరం చేస్తుంది. నిర్మాణాలను చూడటానికి వచ్చే జగనన్నకు ఇన్ని షరతులా, ఆయన కోసం మా లాంటి యువత ఎల్లప్పుడూ ముందుంటుంది.

– పసుపులేటి శేఖర్, శంకరం గ్రామం, అనకాపల్లి మండలం

పేద విద్యార్థులకు అన్యాయం



వైఎస్సార్‌సీపీ హయాంలో మంజూరు చేసిన మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేయడానికి ప్రయత్నిస్తుండటం శోచనీయం. దీనివల్ల వైద్య విద్య పేదలకు దూరం అవుతుంది. ఆర్థికంగా వెనుకబడి ఉండటం వల్లత రూ.లక్షలు వెచ్చించి చదవడానికి అవకాశం లేక వైద్య విద్య మిథ్యగానే మిగలనుంది. వైద్య సేవలు అందుబాటులో ఉండని పరిస్థితి ఏర్పడుతుంది. ప్రభుత్వ హయాంలోనే వైద్య కళాశాలలను నిర్మించి సేవలందించడానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– మజ్జి నాగస్వామి అప్పారావు, ఉగ్గినపాలెం, కశింకోట

పోలీసులు ఆంక్షలు దారుణం



పోలీసులు ఆంక్షలు దారుణంగా ఉన్నాయి. గ్రామాల్లో బుధవారం రాత్రి నుంచి గస్తీ కాయడం, గురువారం ఉదయం నుంచి బయటకు రాకుండా అడ్డుకోనేంత తప్పేం చేశాం. మెడికల్ కళాశాల నిర్మాణాన్ని మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చూడకూడదా? ఆయనకు మద్దతు లేకుండా ఎన్ని రోజులు పోలీసులు అడ్డుకోగలరు. అందుకే జెండా పట్టుకుని మరి వచ్చాను. జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న పోరాటంలో నేను కూడా తోడవుతా.

– సేనాపతి అప్పలనాయుడు, కూండ్రం గ్రామం, అనకాపల్లి మండలం

వైఎస్ జగన్ దృష్టికి పలు సమస్యలు

కశింకోట: స్థానిక కనకదుర్గ ఆలయం వద్ద మాకవరపాలెం మెడికల్ కళాశాల భవనం పరిశీలనకు రోడ్ షోగా వెళ్లి తిరిగి వస్తున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాన్వాయ్ ఆపడంతో మండల సమస్యలపై వివరించినట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు గురువారం తెలిపారు. కూటమి నాయకుల అరాచకాలను వివరించామన్నారు. మహిళా వలంటీర్‌కు ఇచ్చిన ఇంటిని కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కూల్చి వేశారని, దీనిపై బాధితురాలికి న్యాయం చేయాలని వినతి పత్రం ఇచ్చామన్నారు. నియోజకవర్గ క్రిస్టియన్ మైనార్టీ విభాగం అధ్యక్షుడు సన్నీ జేమ్స్, సర్పంచ్ మంత్రి జయరజని, శ్రేణులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన

అనకాపల్లి: గ్రామాలు పట్టణానికి పట్టుగొమ్మలని ఎంపీటీసీ పంచదార్ల కన్నారావు తెలిపారు. మండలంలో తుమ్మపాల గ్రామం కొత్తపేట వీధిలో రూ.20 లక్షలతో సీసీరోడ్డు పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల పరిషత్ నిధులతో రహదారి అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. 15 రోజుల్లో సీసీరోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, గ్రామ పెద్దలు బొడ్డపాటి రాంకుమార్, కర్రి బాబీ, రాజారావు, వడ్డాది అశోక్‌కుమార్, పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

జీఎస్టీ -02 ప్రకారం మందుల అమ్మకాలు



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

అనకాపల్లి టౌన్: కేంద్ర ప్రభుత్వం తగ్గించిన నూతన జీఎస్టీ ప్రకారం మందులు అమ్మకాలు చేపట్టాలని డాక్టర్ సుధాకర్ పేర్కొన్నారు. మండలంలోని తుమ్మపాల పీహెచ్‌సీ ఆవరణలో మెడికల్ షాపు యజమానులతో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణాధార మందులపై 12 శాతం నుంచి 0 శాతం, రోగనిర్ధారణ కిట్లుపై 12 శాతం నుంచి 5 శాతానికి, సాధారణ మందులపై 12 శాతం నుంచి 5 శాతం ధరలు తగ్గాయని, ఈ విధంగాగే అమ్మకాలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా మందుల ధరలపై తగ్గిన శాతం తెలిపే బ్రోచర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ హెచ్‌ఈవో బి. మంగమ్మ, మెడికల్ షాపుల యజమానులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

